# మునగచెట్టు

**తెల్లవారు ఝామునే వెన్నపూస కావిడేసుకుని మావూరి చుట్టు పక్కలున్న ఊళ్ళన్నీ తిరిగి వెన్నపూస కొనుక్కొచ్చి నెయ్యికాసి అమ్మేవాడు పులగం అమ్మిరెడ్డి.**

**సాయంత్రం ఇంటికొచ్చేసరికి వేడ్నీళ్ళుకుండ పొయ్యి మీదెట్టి మొగుడుకోసం ఎదురుచూస్తా ఉండేది అతని పెళ్ళాం బుల్లాలు.**

**స్నానాల దడి దగ్గర గోలెంలో తోరిపిన వేణ్నీళ్ళు పోసుకుంటున్న అమ్మిరెడ్డి వీపు రుద్ది, కొబ్బరిపీచుట్టుకొచ్చి కాళ్ళ దగ్గర తోమేది.**

అన్నం తినడానికి లాంతరు ముందుకూర్చున్నప్పుడు 'నేను తిన్నాకా మిగిలింది నువ్వు తినడం కాదొలే నువ్వుకూడా నాతో పాటే తినాలి'' అని గొడవ చేసేవాడు అమ్మిరెడ్డి.

అలా మొగుడితో పాటే పంచుకుతిన్నాకా దొడ్లో నందివర్ధనం చెట్టు దగ్గర నవారుమంచం వేసి నూతి పళ్ళెం దగ్గర లాంతరూ, రాగిచెంబుడు నీళ్ళూ, కర్రా పెట్టేది. మంచం మీద వాలి కొంచెం ఒత్తిగిలి పడుకున్న అమ్మిరెడ్డి ఎన్ని ఆవులింతలొచ్చినా ఆపుకుంటా వంటగిన్నెలు సర్దుకుని బుల్లాలు ఎప్పుడొస్తదా అని చూసేవోడు. ఆ అమ్మి వచ్చి ఇలా మంచంమొసం మీద చతికిలబడిందో లేదో ఉన్న ఫళాన లాగేసుకునేవాడు దగ్గరికి.

అలాగ కాస్సేపయ్యాకా అలిసిపోయి పడుకునేవారిద్దరూ.

తెల్లారగట్ల మామూలుగా లేచిపోయి ముఖం అదీ కడుక్కున్నాకా పెళ్ళాం ఇచ్చిన చద్దన్నంముంత కావిడికి తగిలించుకుని వెన్నపూస కొనుక్కోడానికెళ్ళిపోయేవాడు.

* * *

మొట్టమొదట పుట్టిన కొడుక్కి సత్తిరెడ్డి అని తర్వాతేడు పుట్టినోడికి పెదరెడ్డి అని పెట్టుకున్నారు. మూడో సంతానం ఆడపిల్ల. దాన్ని అల్లారుముద్దుగా పెంచుకుంటా అన్నపూర్ణ అని పేరెట్టి ముద్దుగా అప్పాయి అని పిలిచేవారు. ఆ తర్వాతోడికి వెంకన్న ఆ తర్వాత చంటిరెడ్డి, వీర్రాఘవరెడ్డి అని పెట్టుకున్నారు పేర్లు.

అయితే వీర్రాఘవరెడ్డి జబ్బు చేసి చచ్చిపోయి వీరభద్రుడయ్యేడు. ఆ వీరభద్రుడ్ని కొల్చుకుంటా ఏటేటా వీరముష్టోళ్ళతో సంబరం






చేయించుకుంటున్న వాళ్ళు ఆ ఏడాది పుట్టిన ఏడోకాన్పు మగ కుర్రాడికి పోయిన కుర్రోడి పేరే పెట్టుకున్నారు వీరెడ్డి అని.

ఒకప్పుడు పొద్దోతే వాకిట్లో వాళ్ళిద్దరికీ ఒకటే మంచం. కానీ, ఇప్పుడు వాళ్ళ పక్క మంచానికిద్దరేసి

చప్పున మరో నాలుగు నులక మంచాలు జేరినియ్యి.

ఆ మంచాల మీద పడుకున్న పిల్లల అల్లరి. ఇక పున్నమిరోజయితే చెప్పక్కర్లేదు ఎవరూ పడుకునే వారు కాదు. ఆ వెన్నెల్లో దాగుడుమూతలూ, కోతికొమ్మచ్చి ఆటలూ, తొక్కుడు బిళ్ళలూ ఒకటే సందడి.



అలాగ వెన్నెల్లో ఆడుకుంటున్న ఆ ఎనిమిదిమంది పిల్లల్ని చూసిన అమ్మిరెడ్డి ''ఈళ్ళని చదివించి ఉజ్జోగాలకి పంపగలమంటావా బుల్లాలూ?'' అన్నాడు.

''ఇంతమందిని సదివించడానికి మనమెక్కడ తూగుతాం చెప్పు?'' అంది బుల్లాలు.

''అయితే మా అమ్మాబాబూ నన్నెలాగ పెంచేరో ఈళ్ళనీ అలాగే పెంచుదా మనిపిస్తంది'' అన్నాడు.

''నీకేటి మేలుం బంగారం... నువ్వన్నట్టే పెంచుదాం'' అంది బుల్లాలు.

ఒకరోజు ద్వారపూడి సంతకెళ్ళిన అమ్మిరెడ్డి పుష్టిగా ఉన్న పాలగేదెని కొన్నాడు. అది పిల్లల సాయంతో గేదెల్ని చూసుకునేది బుల్లాలు. వాటిని కడిగిచిట్టూ తవుడూ పెట్టి, పాలు పితికి అమ్మిరెడ్డి కిస్తే అతను సైకిల్ మీద రామచంద్రపురం పట్టుకెళ్ళి అమ్మేవాడు. ఆదాయం బాగుంది.

ఎప్పుడూ అయిదులూ పదులూ మాత్రమే చూసే వాళ్ళిద్దరూ వందలూ అప్పుడప్పుడు వేలూ కూడా చూస్తున్నారు. దాంతో రెండు కుంచాల పొలాన్ని కొనుక్కున్నారు. అక్కడ్నించి రెండేసి నాలుగేసి కుంచాలు చొప్పున కొనుక్కెళ్తుంటూ వెళ్తుంటే కొన్నాళ్ళకది పదిహేను ఎకరాలైంది. పిల్లలుకూడా చేదోడు వాదోడుగా ఉంటూ పొలం పన్లు చక్కగా చూసుకుంటున్నారు.

ఓరోజు అన్నం తిని పెరట్లోకొచ్చి చేతులు కడుక్కుంటూ చూశాడు అమ్మిరెడ్డి.

మట్టిని తొలుచుకుని బయటికొచ్చిన ములగమొక్క ఒకటి లేత ఆకులు విప్పుకుంటుంది.

దాన్ని చూసిన అమ్మిరెడ్డి ఆరోజునించి అన్నం తిన్న తర్వాత ఆ ములగమొక్క దగ్గరే చేతులు కడుక్కునేవాడు. దాంతో, అది రోజురోజుకీ ఎదుగుతా చిన్న చిన్న పలవలూ రొబ్బలూ వేసి, పచ్చ పచ్చగా చిగుర్చడం మొదలెట్టింది. పిల్లలుకూడా పెరిగి పెద్దోళ్ళవుతున్నారు.

చేతికందొచ్చిన పెద్దోడు సత్తిరెడ్డితో ఏ వ్యాపారం పెట్టించినా కల్సి రాడం లేదు. అదలాగుండగా కుతుకులూళ్ళో మాణిక్యం అనే మనిషితగిల్తే దాన్ని ఉంచుకున్నాడు. అది తెల్సిన అమ్మిరెడ్డికొంచెం ఎక్కువ ఖర్చుపెట్టి, వెంటనే పెళ్ళి చేసేసేడు కానీ, పెళ్ళయిన కొన్నాళ్ళకే దూళ్ళ వ్యాపారం చేస్తానని చెప్పి పెళ్ళాంతో పాటు రాజమండ్రి వెళ్ళిపోయి అక్కడ కాపురం పెట్టేడు. అయితే అప్పుడప్పుడూ మాణిక్యం కోసం కుతుకులూరు వచ్చేవాడుగానీ అమ్మాబాబుని చూడ్డానికి దగ్గర్లో ఉన్న పసలపూడి మట్టుకొచ్చేవాడు కాదు.

రెండోకొడుకు పెద్ద బండితోలేవాడు. ఈ ఎదవదేన్ని తగులుకుంటాడో అని భయపడ్డ అమ్మిరెడ్డి బుల్లాలూ పెళ్ళి చేసేసేరు. అయితే వాళ్ళకి పిల్లలు పుట్టలేదు. రాజమండ్రి జనరల్ హాస్పిటల్లో మాలోళ్ళ కుర్రోడ్ని కొనుక్కుని ఆ రాజమండ్రి మకాం మార్చేసిన వాళ్ళుకూడా ఇటు పక్కకి రావడం మానేసేరు.

మూడోకొడుకు ఎంకయ్య చాలా తెలివైనవాడు కింద తయారయ్యేడు. కాలికేస్తే వేలికెయ్యగలడు వేలికేస్తే కాలికెయ్యగలడు. పీరారామచంద్రపురంలో మంచి అందగత్తెని చేసుకున్న వెంకయ్యకూడా వేరే కాపరం వెళ్ళిపోయేడు.

అయిదోవాడు చంటిరెడ్డి, కోరిశేషయ్యగారి మూడోకొడుకు సత్యనారాయణరెడ్డి దగ్గర పాలసైకిలు తొక్కడానికెళ్ళి వాళ్ళమరదలు సీతని పెళ్ళి చేసుకుని రకరకాల వేపారాలు జేసి, రకరకాల ముండల్ని తగులుకుని చివరికి చెల్లూరు కాపురం వెళ్ళిపోయేడు.

ఆరోవాడు కాసులరెడ్డి, ఇంట్లోనూ బయటాకూడా కాసు అని పిలుస్తారు. ఎక్కడబడితే అక్కడ గొడవలకి వెళ్ళే ఇతను అక్క (అప్పాయి) కూతుర్నే చేసుకుని తొస్సిపూడికి మకాం మార్చేసేడు.

ఏడోవాడు వీర్రెడ్డి చనిపోయి వీరభద్రుడయిన కుర్రోడి పేరే పెట్టేరితనికి. చిన్నచిన్న దొంగతనాలకి అలవాటు పడ్డ ఇతన్ని దొంగోడు అనడం మొదలెట్టేరు. ఇతనొస్తే చాలు వస్తువులన్నీ దాచేసుకునేవారు. ఈ దొంగోడిక్కూడా పెళ్ళయింది. పెళ్ళాం చాలా అందగత్తె. అత్తోరివూరయిన అనపర్తి వెళ్ళిపోయేడు.

వీళ్ళందరికీ పెళ్ళిళ్ళు చెయ్యడంతో సంపాయించుకున్న ఆస్తి చాలా తరిగిపోయింది. ఊళ్ళో పెద్దోళ్ళంతా ఒకటైవెళ్ళిపోయిన పిల్లలందర్నీ పిల్చి ముసిలోళ్ళు బతకడానికి ఏడాదికి ఒక్కోకొడుకు రెండేసి కాటాల వడ్లు కొలవాలని చెప్పేరు. కానీ, వాళ్ళు ఏనాడూ కొలవలేదు సరికదా? ముసలోళ్ళు దాచుకున్న చిల్లిడబ్బులూ, బేడా, అణా అర్థణా కూడా మెత్తటి మాటలు చెప్పి తీసుకెళ్ళిపోయేవారు.

ఎదిగిన ములగచెట్టు మొదట్లో అన్నం వార్చిన గంజిపోస్తే కాయలు బాగా కాస్తయని అమ్మిరెడ్డి చెపితే ఇంట్లో గెంజిసే కాకుండా ఇరుగుపొరుగు ఇళ్ళవాళ్ళనికూడా అడిగితే తెచ్చిపోసేది బుల్లాలు.

శీతాకాలం.

ఆవేళ పున్నమిరోజు.

తలారాస్నానం చేస్తున్న అమ్మిరెడ్డి వీపు తోమిన బుల్లాలు తడుంబాతతో ఒళ్ళంతా తుడిచింది. నాపరాయి మీంచి అడుగు నేల మీదేస్తున్న పెనిమిటి గోచి పెట్టుకున్న గళ్ళరుమాలు తీసుకుని స్నానం చెయ్యగా మిగిలిన వేణ్ణీళ్ళలో గుంజి ఆరేసింది.

పొడిబట్ట తీసుకొచ్చి పీట మీద కూర్చున్న అమ్మిరెడ్డి. కోడిగుడ్ల పులుసేసుకుని తిన్నాకా, వాకిట్లో ఎదిగిన ములగచెట్టు కింద మంచం వాల్చుకుని దుప్పటి పరుచుకున్నాడు.

దానిమీద వాలిన అమ్మిరెడ్డి బుల్లాలు మణికట్టు మీద సైతిగా రాస్తా "ఒలే... పిల్లలు వెళ్ళిపోయేరని బెంగెట్టుకోకు. పెంచేం..ఇంటి పట్టునుంటారు మనల్ని చూసుకుంటారు అనుకున్నాం..అనుకున్నట్టు అవ్వలేదు మరి. దానికేం ఇదయిపోకు. ఆళ్ళేదో మనల్ని సాకుతారనా ఆనాడు మనం పెళ్ళి చేసుకుంది? అయితే ఒలే... మన పిల్లల్తో పాటు సరిసమానంగా పెరిగిన ఈ మునగచెట్టుంది చూడు. మనం బిడ్డలాగ చూసుకోడానికి మనకి ఇది చాలదంటావా చెప్పు?" అన్నాడు.

మొగుడు మాటాడింది సబబుగా అనిపించింది బుల్లాలుకి.

''అబ్బురంగా అత్తారబతంగా మనం పెంచుకున్న మగబిడ్డలు అలా ఎగిరిపోయినందుకు మనల్ని చూసుకోడానికి ఈ మునగచెట్టు నిచ్చేడు ఆ భగమంతుడు? అని ఎందుకు అనుకోకూడదు మనం జెప్పు?'' అన్నాడు.

మొగుడు మాటాడింది సబబుగా కాదు బేసబుగా అనిపించిన బుల్లాలు ఒక్క ముక్క ఎదురు మాటాడితే ఒట్టు.

* * *

కొన్నాళ్ళు గడిచినియ్యి.

బుల్లాలు ఆరోగ్యం పాడై, సరిగ్గా కళ్ళు కనపడక నానా అవస్థలు పడుతుంటే అమ్మిరెడ్డి ఇంట్లో అన్ని పన్లు చేసేవాడు. కాలవ దగ్గరకెళ్ళి బిందెల్తో నీళ్ళు మోసుకొచ్చేవాడు. గిన్నెలు తోమేవాడు. అన్నం ఇగురూ వండేవాడు. బుల్లాల్ని చంటి పిల్లలా చూసుకునేవాడు.

ఒకరోజు జ్వరం వచ్చింది అమ్మిరెడ్డికి.

నాలుగురోజులపాటు మూసిన కన్ను తెరవకండా పడుకున్నాడు. అయిదోరోజున తెల్లారుఝామున నిద్దట్లోనే పోయేడు అమ్మిరెడ్డి. దాంతో వొంటరి దయిపోయింది బుల్లాలు.

కొడుకులు, కూతుళ్ళు వచ్చి చిన్నదినం పెద్దదినం చేసి మిగిలిన కాస్త ఆస్తిని పంచేసుకుని వెళ్ళిపోతా ఇల్లు తల్లికిచ్చి ఎవరు తల్లిని కడదాకా చూసుకుంటారో ఆళ్ళకే ఆవిడి తదంతరం ఆ ఇల్లు చెందుద్దని అన్నారు.

మా ఇంటికి రా అంటే మా ఇంటికి రా అని కొడుకులూ, కూతురూ పిలిచేరు. కానీ, నా ఇల్లు వదిలి ఎక్కడికీ రానని కరాకండీగా చెప్పేసింది బుల్లాలు.

ఆ ఇంట్లో మునగచెట్టూ, బుల్లాలు మిగిలేరు చివరికి. ఒకరికి ఒకరు తోడు నీడ. మునగచెట్టు పూత పూసి, కాడల్ని కాస్తుంది. పిల్లలు మిగిలిన ఆస్తి పంచుకుని పట్టుకుపోడంతో ఆ కాడల్ని అమ్మి పొట్ట పోసుకుంటుంది బుల్లాలు.

మునక్కాడలు తెలివిగా అమ్మేది బుల్లాలు. పొడువాటి గెడ చివర కొడవలి ముక్క పురుకొసతో కట్టి దగ్గర పెట్టుకునేది. ఎవరైనా రెండు రూపాయల మునక్కాడలు కావాలని వస్తే, వాళ్ళనే కోసుకోమని గెడ ఇచ్చేది. నచ్చిన కాడలు కోసుకుని ముసలమ్మకిస్తే కళ్ళు కనపడకపోడం వల్ల చేత్తో తడిమి కాడలు ఇచ్చేది వాళ్ళెక్కువ కోసుకుంటే లాక్కుని కాళ్ళకింద తొక్కి పెట్టేసేది.

ఏ మధ్యానమప్పుడన్నా ఎవరన్నా వచ్చి తన పక్కన కూర్చుంటే పప్పుచారులో మునక్కాడలేస్తే ఎంత రుచిగా ఉంటుందో, మునక్కాడలతో ఆవకాయ ఎలా పెట్టాలో, ములక్కాడామాంసం వండుకుంటే ఎలా ఉంటుందో విన్నోళ్ళకి నోరూరేలాగ చెప్పేది.

కడుపున పుట్టిన కొడుకులు చూడకపోయినా, కన్న కొడుకులా చూసుకుంటంది, మునగచెట్టు గొప్పదనం గురించి కతల్లాగ చెప్పేది. ఆ ఏడాది పెద్ద తుఫానొచ్చింది.

తెల్లారి లేచి చూసేసరికి మునగచెట్టు వేళ్ళతో పాటు నిట్ట నిలువునా కూలిపోయి ఉంది.

బుల్లాలు జీవితంలో భర్త పోయినప్పుడు ఏడ్చింది. తర్వాత ఎప్పుడూ ఎన్ని బాధలొచ్చినా ఏడవలేదు. మళ్ళీ తన ప్రాణంలో ప్రాణం లాంటి ఈ మునగచెట్టు పడిపోయినప్పుడు అంతకంటే ఎక్కువగా ఏడ్చింది. గొంతుకు ఎండిపోయే దాకా ఏడ్చింది. కళ్ళు చిల్లులు పడేలాగ ఏడ్చింది. స్పృహ తప్పేదాకా ఏడ్చింది.

* * *

వంశీ పసలపూడి

కథలు-72